క్లుప్తంగా

అనాథ పిల్లలను గుర్తించండి



గురజాల: గ్రామాల్లో తల్లిదండ్రులు మరణించి అనాథలుగా ఉన్న పిల్లలను గుర్తించి, సమాచారం సేకరించాలని సీడీపీవో షేక్ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం మాసికా మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు మాసోత్సవాలు ప్రతి కేంద్రం నందు విధిగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అడ్డుకుని, చిన్నారుల ఆరోగ్యపరమైన సమస్యలుంటే సత్వరమే పరిష్కరించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ కె.శైలజ, సూపర్ వైజర్ వై.రత్న కుమారి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివ నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11 కేవీ ఆర్ఆర్ ఫీడర్ నందు మరమ్మతులు నిర్వహిస్తున్నందున కొండమోడు నుంచి పిడుగురాళ్ల పట్టణం వైపు వరకు మెయిన్ రోడ్డు ఎడమ వైపు, అంజిరెడ్డి హాస్పిటల్ వెనుక వైపు, గంగమ్మ తల్లి గుడి వెనుక, మిలటరీ కాలనీ, జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక వైపు, రసూల్ పేట ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 226 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో 226 మంది విద్యార్థులు శనివారం హిందీ పరీక్షకు గైర్హాజరయ్యారు. డివిజన్ వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 322 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 96 మంది పరీక్షకు హాజరయ్యారు.

29 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ సప్లిమెంటరీ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 37 మంది హాజరు కావాల్సి ఉండగా 29 మంది గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎనిమిది మంది మాత్రమే పరీక్ష రాసినట్లు చెప్పారు.

79 మంది విద్యార్థులు గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రగతి, కృష్ణవేణి జూనియర్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్–1కు 512 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 449 మంది హాజరయ్యారు. 63 మంది గైర్హాజరయ్యారు. ఇంగ్లీష్ పేపర్–2కు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 39 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 23 మంది హాజర య్యారు. 16 మంది గైర్హాజరయ్యారు.


వైన్ షాపులో రూ.1.50లక్షల చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంట గల ప్రభుత్వ వైన్ షాపులో నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పురావూరుకాలనీ జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్‌షాపులో సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విక్రయించగా వచ్చిన రూ. 1.50లక్షలను కౌంటర్‌లో ఉంచి తాళాలు వేసి వెళ్లారు. శనివారం మరలా తెరిచేందుకు రాగా షట్టర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కౌంటర్‌లోని నగదు కూడా మాయమైంది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షాపు సూపర్‌వైజర్ నక్కా గోపి ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాలు సేకరించారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

మండలంలో అల్లర్లు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. ఊరేగింపులు, బాణసంచా కాల్చినా, కవ్వింపు చర్యలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లకు ప్రతిరోజూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



అచ్చంపేట: విద్యుత్ షాక్ గురైన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కుంటిమద్ది గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మాదిపాడు గ్రామానికి చెందిన రాజనాల నాగరాజు (27) ఎలక్ట్రీషియన్‌గా వైరింగ్ పనులు చేస్తుంటాడు. కుంటిమద్దిలోని ఓ ఇంటిలో వైరింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. ఇరుగు పొరుగు వారు వైద్యుని పిలిపించి చూపించగా మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతునికి భార్య ఒక కుమారై ఉన్నారు.

అంగన్‌వాడీ..నూతన ఒరవడి

- శ్రీ స్కూల్స్‌తో చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన
- ఇంటి వద్దకే బాలింతులకు, గర్భిణులకు పౌష్టికాహారం
- శ్రద్ధతో చిన్నారుల ఆలనాపాలనా



అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు

గురజాల : అంగన్‌వాడీ కేంద్రాలు చక్కటి రీతిలో సేవలందిస్తున్నాయి. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, మందులు అందజేత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లలకు చదువు వంటి అన్ని అంశాలను శ్రద్ధతో నిర్వహిస్తున్నాయి. టేక్ హోమ్ పద్ధతిలో బాలింతలకు ఇంటికే రేషన్ అందిస్తూ వారు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలను ప్రభుత్వం మోడరన్ ప్రీ స్కూల్స్‌గా తీర్చిదిద్దింది. బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందిస్తూ ఆరోగ్య రక్షణ కల్పిస్తోంది. చిన్నారుల్లో రక్త హీనతతో నివారణకు డ్రై రేషన్ కూడా అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా ప్రైవేట్ పాఠశాలలను మించి రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది.

ఇంటి వద్దకే సరుకులు..

టేక్ హోం పద్ధతిలో బాలింతలకు 15 రోజులకోసారి వైఎస్సార్ కిట్, వైఎస్సార్ బ్యాగ్‌తో పాటు రెండు కేజీల రాగిపిండి, అటుకులు కిలో, పావు కిలో బెల్లం, చిక్కీలు, ఖర్జూరం అంగన్‌వాడీల్లో అందజేస్తున్నారు. మూడు కిలోల బియ్యం, కిలో కంది పప్పు, ఆయిల్, 13 గుడ్లు, పాలు అందిస్తున్నారు.



చిన్నారులను ఆడిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆట పాటలతో కూడిన విద్య

చిన్నారులకు అంగన్ వాడీ కేంద్రంలో ఆడుకునే వస్తువులు అందుబాటులో ఉన్నాయి. గురజాల మండలంలో 56, దాచేపల్లి మండలంలో 76 అంగన్ వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో గర్భిణీలు–902 మంది, బాలింతలు–799 మంది, 6 నెలలు నుంచి –3 సంవత్సరాల లోపు చిన్నారులు 5,157 మంది, 3 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులు 4,779 మంది ఉన్నారు. చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు వారి మంచిచెడులు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చూసుకుంటారు.

అనుమతుల్లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రెంటచింతల: అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని విత్తన విక్రయ కేంద్రాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్రయ విక్రయాల రికార్డులను, వివిధ కంపెనీలకు చెందిన విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎమ్మార్పీ ధరలకు ఇవ్వాలని సూచించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే సదరు దుకాణాలపై శాఖపరమైన చర్యలు తీసుకుని, సీజ్ చేస్తామని హెచ్చరించారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించినట్లు తెలిపారు.



విత్తన విక్రయ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు , లాట్ నంబర్‌తో సహా కొనుగోలు రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. ఈ దాడుల్లో వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ తదితరులున్నారు.

బొల్లవరంలో విద్యా చైతన్య ప్రచారోద్యమం



బొల్లవరం(ముప్పాళ్ళ): సమాజంలో గౌరవ మర్యాదలు పెరగాలంటే విద్యతోనే సాధ్యమని డీబీఆర్సీ మహిళా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో విద్యా చైతన్య ప్రచారోద్యమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వం చదువుకునే వారికి మంచి ఆహారం, యూనిఫాం, పుస్తకాలు, షూస్, బెల్ట్ ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ఉన్నతంగా చదువుకుని రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బడికి పంపించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు మార్చేందుకు ఉచిత విద్య, అమ్మ ఒడి, విద్యా దీవెన స్కాలర్‌షిప్ అవకాశాలు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ వినియోగించుకొని పిల్లల్ని చదువుకొనేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు రమ్యకృష్ణ, ఏఎస్ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి దేవాలయానికి నిత్యం వచ్చే భక్తుల తాగునీటి సౌకర్యార్థం అమరావతి క్యాపిటల్ కిట్టి పార్టీ వారు సుమారు రూ.20వేలు విలువైన వాటర్ కూలర్‌ను అందజేశారు. శనివారం కిట్టిపార్టీ నిర్వాహకురాలు బాలనాగు నాగమాధవి ఆధ్వర్యంలో సభ్యులు దూబగుంట విజయ, వల్లంబోట్ల విజయ, చేగురాధ, పారేపల్లి పుష్పలత, నిర్మల దేవాలయ నిర్వాహకులకు అందచేశారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని విత్తన దుకాణదారులు తప్పకుండా విత్తన ధరల పట్టిక, రోజువారి విత్తన నిల్వల వివరాలు షాపు నందు ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా విత్తనాల కృత్రిమ కొరత సృష్టించకూడదని, అధిక ధరలకు విక్రయించకూడదని స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. విత్తన డీలర్లు అధీకృత కంపెనీ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్లు రైతులకు అధిక ధరలకు విత్తనాలు అమ్మినా, అనుమతులు లేని విత్తనాలు




ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

విక్రయాలు జరిపినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని పలు ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాలు తనిఖీ చేసి, షాపు లేదా డీలర్ పేరు మీద బిల్లు లేకుండా ఎటువంటి విత్తనాలు వచ్చినా వ్యవసాయ శాఖా అధికారి కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.

ఈత.. కారాదు గుండెకోత !

- చిన్నారుల ప్రాణాలమీదకు తెస్తున్న ఈత సరదా
- సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం
- ఈతలో శిక్షణ ఇప్పిస్తే మంచిది



కృష్ణానది ప్రకాశం బ్యారేజ్‌పై ఎత్తు ప్రాంతం నుంచి నీటిలోకి దూకుతున్న బాలుడు

తాడేపల్లి రూరల్: చిన్నారుల ఈత సరదా ఒక్కోసారి ప్రమాదాలకు దారి తీస్తుంది. పాఠశాలలకు సెలవులు కావడం, వేసవి ఎండ తాపం నేపథ్యంలో స్నేహితులు, ఇరుగుపొరుగు వారితో కలిసి కాల్వలు, చెరువులు, గుంటలలో ఈతకని, స్నానానికని వెళ్లి పలువురు చిన్నారులు మృత్యువాత పడుతున్న ఘటనలు మనం చూస్తున్నాం . గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగు, తాగునీరు కోసం కాలువలు ఉన్నాయి. ఇవేకాకుండా జిల్లావ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిల్లో ఈతకని వెళ్లి పలువురు చిన్నారులు ప్రమాదాల బారిన పడుతూ తల్లిదండ్రులకు గుండెకోత మిగిలుస్తున్నారు.

కంట కనిపెట్టాలి


తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని క్షుణ్ణంగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారు బయటకు వెళ్లిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. సెలవుల కారణంగా ఇళ్లవద్దే ఉంటున్న చిన్నారులను ఒక కంట కనిపెడుతూ, ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం మూలాన వారు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్నారులు ఈత సరదాతో కాలువలు, నదులు, కుంటలు, చెరువులకు వెళ్తున్నారు. అందులో ఒకరికో ఇద్దరికో ఈత రావడం.. వారి భరోసాతో నీటి లోపలకు వెళ్లడంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్నేహితులతో బయటకి పంపిస్తే ఎవరితో వెళుతున్నారు.. ఎక్కడికి వెళుతున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి.

నీరు కన్నీరు

వానలు కురుస్తుండడంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కాలువలు, చెరువుల్లో నీరు చేరుకుంది. పిల్లలు సెలవు రోజుల్లో ఈతకోసం సరదాగా నీటివద్దకు వెళుతుంటారు. ఈత వచ్చిన వారితో పాటు ఈతరాని వారు కూడా నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈత వచ్చినవారు సైతం ఒక్కోసారి పెరిగే నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకొనిపోవడం, ఊబుల్లో దిగబడడం వంటివి జరుగుతుంటాయి. అందుకే సాధ్యమైనంతగా చెరువులు, కాలువలకు దూరంగా ఉండడం మంచిది. ఈ మధ్య కృష్ణానది ఎగువ, దిగువ ప్రాంతాల్లో చుట్టపు చూపుగా వచ్చిన ఎంతోమంది చిన్నారులు ఈత సరదాతో మృత్యువాత పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

- గుంటూరు వెంకటరెడ్డిపాలేనికి చెందిన బీటెక్ విద్యార్థి ఇటీవల మహానాడులోని బంధువుల ఇంటికి వచ్చి పిల్లలతో కలసి కృష్ణానదికి వెళ్లి నీటిగుంటలో పడి మృతి చెందాడు.
- విజయవాడ రామలింగేశ్వనగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలకు సెలవులు కావడంతో సరదాగా ఈతకు వచ్చారు. అందులో ముగ్గురు మృతిచెందగా ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఇప్పటి కూడా ఆచూకీ లభించలేదు.

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



సరదాగా ఈతకు వెళ్లి ముక్కుపచ్చలారని చిన్నారులు ఎంతోమంది నదులు, కాలువల్లో దిగి ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. పిల్లలకు ఈత అంటే సరదా. సెంటర్లకు పంపి నేర్పించడం చాలా మంచిది. వారి కోర్కెలను మనం గుర్తించకుండా ఉండడం వల్లే చాలామంది ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లి మృత్యువాత పడుతున్నారు. మంగళగిరి కార్పొరేషన్‌లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. అలాంటి కేంద్రాలకు పిల్లలను పంపి నేర్పించాలి.

– రామకృష్ణ, ఈత శిక్షకుడు

అప్రమత్తంగా ఉండాలి..

సెలవుల్లో విద్యార్థులు, ఊర్లకు వెళ్లే కుటుంబాల వారు అన్ని విషయాల్లో తగిన రీతిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులు నదులు, కాలువలు, బావులలో సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

– కల్యాణ్ రామ్, తాడేపల్లి సీఐ

బీజీ–3 విత్తనాలు విక్రయించొద్దు

దాచేపల్లి : బీజీ–3 విత్తనాల విక్రయాలకు అనుమతులు లేవని మండల వ్యవసాయశాఖ అధికారి డి.పాపకుమారి తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాల క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుమతులు ఉంటేనే విత్తనాలు విక్రయించాలని, విత్తనాల కంపెనీలకు సంబంధించి సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్స్ లేకుండా విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లూజు విత్తనాలు విక్రయించిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో పలువురు వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.



దాచేపల్లి ఎరువుల దుకాణంలో ఏవో పాపకుమారి తనిఖీ

మిర్చి రైతుల పాట్లు



చేజర్ల గ్రామంలో ఆరబెట్టిన మిర్చిపై పట్టా కప్పుతున్న రైతు



మిరపకాయలు ఆరబెడుతున్న రైతు

నకరికల్లు: ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో మిర్చి రైతులు ఆందోళనలో మునిగిపోయారు. మండలంలోని చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లోని మెట్ట భూముల రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. ప్రస్తుతం కాయలు కల్లాల్లో ఆరబెట్టారు. కొద్ది రోజులుగా కాయలు ఆర బెట్టడం.. వెంటనే వాతావరణం చల్లబడడంతో హడావుడిగా పట్టలు కప్పుకోవడం రోజువారీ తంతుగా మారింది. శనివారం రోహిణి కార్తె ప్రవేశించడంతో మిరప కాయలు ఎండబెట్టుకోవచ్చని అనుకుంటున్న రైతులకు ఉదయం నుంచి తుప్పర్లు పడడంతో పట్టాలు కప్పడం..కొద్ది సేపటికే జల్లులు తగ్గడంతో మళ్లీ వాటిని తొలగించడంతో సమయం సరిపోయింది. మిరపకాయలు పూర్తిగా ఆరకపోయినా, వర్షానికి తడిస్తే.. కాయ పాడవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదే విధంగా వాతావరణం ఉంటే మిర్చి పంటకు పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

బకాయిలున్నందునే కొత్త రుణాలు ఇవ్వలేకపోతున్నాం

స్త్రీనిధి బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బుల్లియ్య

అచ్చంపేట: మండలంలో గ్రామాఖ్య సంఘాలు తీసుకున్న స్త్రీనిధి రుణాలను 75 శాతానికి పైగా బకాయిలు పేరుకు పోయాయని, అందు వల్లే కొత్తగా రుణాలు ఇవ్వలేకపోతున్నామని జిల్లా స్త్రీనిధి బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చిన్న బుల్లియ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు మండలంలోని 43 గ్రామైఖ్య సంఘాలకు రూ.3 కోట్లకు పైగా స్త్రీనిధి రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆ రుణాలలో 2023–2024 లో రూ.2.09కోట్లు, గత రెండు మూడు నెలల వ్యవధిలో మరో రూ.16 లక్షలు వసూలు చేయడం జరిగిందన్నారు. వడ్డీతో కలుపుకుని మరో రూ.93లక్షల వరకు చెల్లించవలసి ఉందన్నారు. అందులో పెదపాలెం క్లస్టర్ నుంచి రూ.38.70లక్షలు, మాదిపాడు క్లస్టర్ నుంచి రూ.3.89లక్షలు, అచ్చంపేట క్లస్టర్ నుంచి రూ.17.70లక్షలు రికవరీ కావాల్సి ఉందని చెప్పారు. రుణాలు తీసుకున్న గ్రామైక్య సంఘాల సభ్యులు ఎవరికైతే నగదు చెల్లించారో వారి నుంచి వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. ఆ నగదును గ్రామ సంఘం ఖాతాలో జమచేసి ఆన్‌లైన్లో పొందుపరిస్తేనే చెల్లించినట్లవుతుందని స్పష్టం చేశారు. అలా చేయకపోతే స్త్రీనిధి బ్యాంకులో బకాయిలు ఉన్నట్లుగానే చూపించడం జరుగుతుందని చెప్పారు. గ్రామైక్య సంఘాలు తమ పరిధిలోని సీసీలకు ఇచ్చినా వారు బ్యాంకు ఖాతాలో జమచేయకపోతే ఆ డబ్బును వారు వాడుకున్నట్లు భావించవలసి ఉంటుందన్నారు. దీనిపై కొన్ని పత్రికలలో



మాట్లాడుతున్న స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం చిన్న బుల్లియ్య

వెలుగు కార్యాలయంలో అవినీతి జరిగినట్లు వార్తలు రావడంతో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు బృందాలు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. బాధ్యులైన సీసీలకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయినా వారు చెల్లించకపోవడంతో బ్యాంకులో మొండి బకాయిలుగా మిగిలిపోయాయన్నారు. ఇచ్చిన రుణాలలో 75 శాతానికి పైగా రికవరి చేస్తేనే నూతన రుణాలు మంజూరు చేసేందుకు సాధ్యపడదన్నారు. ఎవరి వద్దనైతే పెండింగ్ ఉందో వారి నుంచి మరో రెండు, మూడు నెలలో నూరుశాతం రికవరి చేస్తామని దీమా వ్యక్తిం చేశారు. రుణాలు తీసుకునేటప్పుడు డాక్యుమెంటేషన్ ఏ విధంగా జరుగుతుందో జమ చేసిన సొమ్మును కూడా అదేవిధంగా ఆన్‌లైన్‌లో పొందపరచవలసి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ ఆశయాల మేరకు మహిళాభ్యుదయం కోసం ప్రవేశపెట్టిన స్త్రీనిధి బ్యాంకు ఆశయాలకు అనుగుణంగా పరిస్థితులను చక్కబెట్టి మళ్లీ మహిళకు స్త్రీనిధి ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం చిన బుల్లియ్య తెలిపారు. ఆయన వెంట ఏపీఎం షేక్ సలీం, వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది ఉన్నారు.

ఇంటర్మీడియెట్ ఉచిత అడ్మిషన్ల గడువు పొడిగింపు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం ట్రస్ట్ ద్వారా ఇంటర్మీడియట్ నందు పదో తరగతి 400 మార్కులు దాటిన విద్యార్థులకు పూర్తి ఉచిత విద్యను అందించనున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్యం ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీ శనివారం తెలిపారు. ట్రస్ట్ కళాశాల ద్వారా ఫీజు, పాఠ్య, నోట్ పుస్తకాలు, బస్సు, వసతి కల్పించబడతాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రుపుల్లో 25 మంది బాల బాలికలకు పూర్తి ఉచిత విద్య అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కుల, మత ప్రాధాన్యం లేకుండా ఎవరైనా ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. గత 30 ఏళ్లుగా ఉచిత విద్యా పథకాన్ని ఆశ్రమం కొనసాగిస్తోందని తెలిపారు. దరఖాస్తులను జూన్ 5వ తేదీ లోగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా అనే చిరునామాకు పంపాలని చెప్పారు. తల్లితండ్రుల వినతి మేరకు గడువు పొడిగించినట్లు ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వేర్వేరుగా తరగతులు, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94403 83782, 94913 00312 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

'కోడ్' అనంతరం మంచినీటి బోర్లు

రాజుపాలెం మండల సర్వసభ్య సమావేశం

రాజుపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ సమావేశం ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం శనివారం నిర్వహించారు. ముందుగా మండలస్థాయి అధికారులు వారి శాఖల అభివృద్ధి పనులను వివరించారు. ఎంఈవో మల్లికార్జునశర్మ మాట్లాడుతుండగా ఎంపీటీసీ సభ్యుడు బత్తుల సాంబశివరావు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉందని, ఎంఈఓగా తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రశ్నించారు. ఇందుకు ఎంఈఓ సమాధానం ఇస్తూ.. జిల్లా పరిషత్ పాఠశాల్లో తనిఖీలు చేసే అధికారం తనకు లేదని, డిప్యూటీ ఈవోకు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని మాట్లాడుతూ కొంతమంది సభ్యులు మంచి నీటి బోర్‌లు అడిగారని, ఎన్నికల కోడ్ అనంతరం వేయిస్తామని చెప్పారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

నగరంపాలెం: హోం గార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. గుంటూరు జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు.